క్లుప్తంగా

ఆపదలో అండగా..


బాధిత కుటుంబ సభ్యులకు చెక్కు అందిస్తున్న పల్లె బ్రదర్స్

కేశంపేట: మండల పరిధిలోని కొండారెడ్డిపల్లి గ్రామంలో శనివారం రాత్రి బైండ్ల లింగం అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడిది నిరుపేద కుటుంబం కావడంతో ఆదివారం గ్రామానికి చెందిన పల్లె బ్రదర్స్ అయిన పల్లె ఆనంద్‌కుమార్, బాలీశ్వర్‌లు లక్ష రూపాయల ఆర్థికసాయం అందించారు. ఈ నగదు మొత్తాన్ని ఆడపిల్లల అవసరాల కోసం పేర్ల పైన బ్యాంక్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో విజేందర్‌రెడ్డి, సూరం శ్రీనివాస్, శివకుమార్, మల్లేశ్‌గౌడ్, కరుణాకర్‌రెడ్డి, శ్రీశైలం, మల్లేశ్, రమేశ్, శ్రీను, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం


రవీందర్ కుటుంబ సభ్యులకు నగదు అందిస్తున్న మిత్రులు

కేశంపేట: స్నేహితుల దినోత్సవం రోజు తమతో కలిసి చదివిన మిత్రుడి కుటుంబ సభ్యులకు తోటి మిత్రులు ఆర్థికసాయం చేశారు. మండల పరిధిలోని కొత్తపేట గ్రామంలో గల జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1995–96 సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థుల్లో కోనాయపల్లికి చెందిన సుప్పరి రవీందర్ ఇటీవల మృతి చెందాడు. దీంతో తోటి మిత్రులు అందరూ కలిసి రూ.50వేలను రవీందర్ కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో పోచారం జగన్‌రెడ్డి, యాదగిరి, రమేశ్‌గౌడ్, వెంకటేశ్, సొప్పరి నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన


రక్తదానం చేస్తున్న యువకుడితో లయన్స్ క్లబ్ సభ్యులు

ఆమనగల్లు: ఆమనగల్లు లయన్స్ క్లబ్, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో కల్వకుర్తి పట్టణంలో ఆదివారం నిర్వహించిన రక్తదానం శిబిరానికి విశేష స్పందన వచ్చింది. ఈ శిబిరాన్ని ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ఉప్పల వెంకటేశ్‌తో కలిసి లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పసుల లక్ష్మారెడ్డి ప్రారంభించారు. ఈ శిబిరంలో 72 మంది రక్తదానం చేశారు. అనంతరం వారు మాట్లాడారు. రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ జూలురి రమేశ్, పీఆర్‌ఓ పాషా, సభ్యులు వెంకట్‌రెడ్డి, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏఐఎస్‌ఎఫ్ మండల అధ్యక్షురాలిగా భవాని

హుడాకాంప్లెక్స్: ఏఐఎస్ఎఫ్ సరూర్‌నగర్ మండల అధ్యక్షురాలిగా బాతరాజు భవాని నియమితులయ్యారు. ఈ సందర్భంగా భవాని మాట్లాడుతూ.. రాజేంద్రనగర్‌లోని సీపీఐ జిల్లా కార్యాలయంలో జరిగిన ఏఐఎస్ఎఫ్ జిల్లా నిర్మాణ కౌన్సిల్ సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. రాష్ట్రం ఏర్పాటైన నాటి నుంచి ప్రభుత్వ కళాశాలలు, పాఠశాలలు, హాస్టళ్లలో కనీస వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఈ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా పోరాటాలు చేస్తానని చెప్పారు.

రోడ్డు విస్తరణపై దృష్టి పెట్టండి

యాచారం: కందుకూరు–యాచారం గ్రామాల మధ్య వంద అడుగుల రోడ్డు విస్తరణపై రోడ్డు భవనాల శాఖ అధికారులు దృష్టి సారించాలని బీఎస్ఆర్ ట్రస్ట్ చైర్మన్ బిలకంటి చంద్రశేఖర్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. గత బీఆర్ఎస్ సర్కార్ హయాంలోనే రోడ్డు విస్తరణకు నిధులు మంజూరయ్యాయని, అధికారుల నిర్లక్ష్యంతో పనులు ముందుకు సాగలేదని తెలిపారు. అధికారులు స్పందించి త్వరలో రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని కోరారు. రోడ్డు విస్తరణ విషయమై ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కోరినట్లు పేర్కొన్నారు.


ఆలూరులో అంబేడ్కర్ చౌరస్తా వద్ద కుక్కల గుంపు


ఆలూరులోని హనుమాన్ వీధిలో శునకాల సమూహం

కుక్కల బెడద.. నిత్యం దడ

- చిన్నారులను గాయపరుస్తున్న శునకాలు
- రోడ్లమీద ప్రయాణించాలంటే జంకుతున్న ప్రజలు
- పూర్తిస్థాయిలో నియంత్రణ చేపట్టని అధికారులు

చేవెళ్ల: గ్రామాల్లో వీధి కుక్కల బెడద అధికమైంది. కుక్కలు గుంపులు, గుంపులుగా స్వైరవిహారం చేస్తూ చిన్నా పెద్ద అని తేడా లేకుండా దాడి చేస్తున్నా సంబంధిత అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. దీంతో రోడ్లమీద ప్రయాణించాలంటేనే ప్రజలు భయాభ్రాంతులకు గురవుతున్నారు. మండలంలోని ఆలూరు గ్రామంలో వీధి వీధిలో కుక్కలు గుంపులుగా స్వైరవిహారం చేస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. రోడ్లపై పిల్లలను ఒంటరిగా పంపించాలంటే భయపడాల్సి వస్తుందని, శునకాల బెడదతో నితత్యం నరకం అనుభవిస్తున్నామని పేర్కొంటున్నారు. గతంలో అయితే పిల్లలు యేథేచ్ఛగా రోడ్లపైకి వచ్చి ఆడుకునేవారని ఇప్పుడు వారిని బయటకు పంపించాలంటే భయపడిపోతున్నామని చెబుతున్నారు. కుక్కల బెడద రోజు రోజుకు పెరిగిపోతోందని, వీటి నివారణకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. వీటిని ఇలాగే వదిలేస్తే ఇక రోడ్లపైకి పెద్దవాళ్లు కూడా ఒంటరిగా వచ్చే పరిస్థితి లేకుండా పోతుందన్నారు. ప్రజల ప్రాణాలకు నష్టం జరగకుముందే అధికారులు జాగ్రత్తలు వహించాలని కోరుతున్నారు. ప్రత్యేకాధికారి, గ్రామ కార్యదర్శి ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వెంటనే కుక్కల బెడదను నివారించాలని ఆలూరు గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రజలను మోసం చేస్తున్న వ్యాపారులు

కాంగ్రెస్ పార్టీ ఆదివాసీ సెల్ రాష్ట్ర కో–ఆర్డినేటర్ రఘునాయక్


మాట్లాడుతున్న రఘునాయక్

షాద్‌నగర్: పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన వెంచర్లపై ఉన్నతాధికారులు పూర్తిస్థాయిలో విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ ఆదివాసీ సెల్ రాష్ట్ర కో–ఆర్డినేటర్ రఘునాయక్ అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రఘునాయక్ మాట్లాడుతూ.. షాద్‌నగర్ ప్రాంతం శరవేగంగా విస్తరిస్తోందని, రియల్ ఎస్టేట్ వ్యాపారులు పెద్దఎత్తున భూములు కొనుగోలు చేసి వెంచర్లు వేశారన్నారు. అయితే గత పాలకుల హయాంలో కొందరు వ్యాపారులు అక్రమ లేఅవుట్‌లు వేసి ప్రజలను మోసగించారని ఆరోపించారు. నిబంధనల ప్రకారం పదిశాతం భూమి కేటాయించాల్సి ఉన్నా చాలా వెంచర్లలో కేటాయించలేదన్నారు. అదేవిధంగా వెంచర్లలో డ్రైనేజీ, విద్యుత్, రోడ్లు తదితర వాటిని నిర్మించాలని నిబంధనలు ఉన్నా ఎక్కడా పాటించలేదన్నారు. ముఖ్యంగా షాద్‌నగర్ పరిధిలో బిల్డింగ్ బ్లాక్స్, సువర్ణకుటీర్, స్పెక్ట్రా డీఏ స్పార్ తదితర సంస్థలవారు ఏర్పాటు చేసిన వెంచర్లలో అక్రమాలు చోటు చేసుకున్నాయని ఆరోపించారు. ప్రభుత్వ భూములు, నక్షబాటలు కబ్జాకు గురయ్యాయని ఈ విషయం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. వెంచర్లలో ప్రజా ప్రయోజనాల పదిశాతం భూములను గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీలకు విడిచిపెట్టాల్సి ఉన్నా వాటిని కూడా వ్యాపారులు అమ్ముకున్నారన్నారు. పీసీసీ సభ్యుడు బాబర్‌ఖాన్ మాట్లాడుతూ.. గతంలో వ్యాపారులు ఇక్కడి పాలకుల అండతో అధికారులతో కుమ్మక్కై, ఇష్టారాజ్యంగా వ్యవహరించారన్నారు. ఈ ప్రాంతంలో అక్రమ వెంచర్ల వ్యవహారంపై జిల్లా కలెక్టర్ పూర్తి స్థాయిలో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో డీసీసీ ఉపాధ్యక్షుడు ఎమ్మె సత్తయ్య, శంకర్ పాల్గొన్నారు.

ఘనంగా అమావాస్య హోమం


హోమం నిర్వహిస్తున్న పండితులు, భక్తులు

కందుకూరు: మండలంలోని పులిమామిడి పరిధిలోని శ్రీనిఖిల్ చేతనా కేంద్రంలో అమావాస్యను పురస్కరించుకొని బ్రహ్మశ్రీ గురూజీ అనిల్‌కుమార్‌జోషి ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా హోమం కార్యక్రమం నిర్వహించారు. హోమం పూర్తి చేసి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం భక్తులకు గురూజీ ప్రవచనాలు చేసి ఆశీర్వాదాలతో పాటు అన్నప్రసాదం అందించారు. ఈ సందర్భంగా గురూజీ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తమతోపాటు తమ చుట్టూ పక్కల వారి క్షేమం కూడా కాంక్షిస్తూ మెదులుకోవాలన్నారు. నిత్యం భగవంతుడి సాధనలో కొంత సమయాన్ని కేటాయిస్తే ఆటుపోట్లను తట్టుకునే మానసిక సామర్థ్యం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

పేదలకు వరం సీఎంఆర్‌ఎఫ్


చెక్కు అందజేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

ఆమనగల్లు: నిరుపేదల ఆరోగ్య పరిరక్షణకు సీఎంఆర్ఎఫ్ వరమని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. నారాయణపూర్ గ్రామానికి చెందిన తారాసింగ్‌నాయక్ అనారోగ్యానికి గురయ్యారు. ఈ విషయాన్ని స్థానిక నాయకులు గోలి శ్రీనివాస్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన సీఎం సహాయనిధికి దరఖాస్తు చేయించారు. దీంతో మంజూరైన రూ.16,500ల చెక్కును ఆమనగల్లు పట్టణంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో తారాసింగ్‌నాయక్‌కు అందజేశారు. కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్ నాగులునాయక్, తలకొండపల్లి మండల టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్‌రెడ్డి, సతీశ్, గురువయ్య, శ్రీను, గణేశ్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణతో మానవాళికి మేలు


మొక్కలు నాటుతున్న సేవా సమితి సభ్యులు

చేవెళ్ల: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని సత్యసాయి సేవా సమితి మహిళా యూత్ కో–ఆర్డినేటర్ నాగజ్యోతి అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం అఖిల భారత స్థాయిలో ఆగస్టు 4వ తేదీన చేపట్టిన 'ప్రేమ తరు–మొక్కలు నాటు' కార్యక్రమంలో భాగంగా శ్రీసత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో చేవెళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సేవా సమితి సభ్యులందరూ కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లా సత్యసాయి సేవా సమితి యువతతో పాటుగా భక్తులు ఈ కార్యక్రమంలో పెద్దసంఖ్యలో పాల్గొంటున్నార ని అన్నిచోట్ల విరివిగా మొక్కలు నాటే కార్యక్రమం చేపడుతున్నారన్నారు. పర్యావరణ పరిరక్షణకు అత్యధిక సంఖ్యలో మొక్కలు నాటి స్వామివారి ఆశీస్సులు పొందాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణతో మానవాళికి ఎంతో మేలు జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించి మొక్క లను పెంచాలని చెప్పారు. కార్యక్రమంలో సత్య సాయి సేవా సమితి చేవెళ్ల కన్వీనర్ రామగౌడ్, యూత్ కో–ఆర్డినేటర్ విజయ్‌కుమార్, సేవాదల్ కో–ఆర్డినేటర్ భాస్కర్, మహిళా యూత్ కో–ఆర్డినేటర్ నిర్మల, విజయకుమార్, సభ్యులు శశిరేఖ, స్వ రూప, మధుసూదన్, పెంటారెడ్డి, చేగూరి మానిక్యరెడ్డి, మహేందర్‌రెడ్డి, విఠల్‌రెడ్డి, ఆంజనేయులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

ఆమనగల్లు: పట్టణ సమీపంలో హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారిపై శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో టీఆర్ఎస్ నాయకుడు బాణోత్ రమేశ్‌నాయక్ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, ఫుడ్‌కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, ఆమనగల్లు మాజీ జెడ్పీటీసీ అనురాధ, కడ్తాల్ మాజీ జెడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్‌లు వులుగోనిపల్లి తండాకెళ్లి మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం మృతుని కుటుంబ సభ్యులకు రూ.35 వేలు ఆర్థికసాయం అందజేశారు. మున్సిపాలిటీ టీఆర్ఎస్ అధ్యక్షుడు పత్యానాయక్, మాజీ ఎంపీటీసీ సభ్యులు లచిరాంనాయక్, పంతునాయక్, మాజీ సర్పంచులు లక్ష్మణ్‌నాయక్, సోన శ్రీనునాయక్, నాగులునాయక్, రమేశ్, సోమ్లు, రైసల్ నాయక్, కొర్ర భాస్కర్‌రావ్ ఉన్నారు.

ఉద్యోగులకు పదవీ విరమణ సహజం

రిటైర్డ్ సబ్ రిజిస్ట్రార్ రాజేంద్రకుమార్

చేవెళ్ల: ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు, రిటైర్‌మెంట్‌లు అనేవి సహజంగా జరుగుతుండేవేనని రిటైర్డ్ సబ్ రిజిస్ట్రార్ రాజేంద్రకుమార్, చేవెళ్ల నుంచి బదిలీ అయిన ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ విష్ణుగౌడ్‌లు అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం వీరయ్య గార్డెన్‌లో చేవెళ్ల నుంచి బదిలీ అయిన ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్, సీనియర్ అసిస్టెంట్ విష్ణుగౌడ్, జూనియర్ అసిస్టెంట్‌లు దేవిక, ప్రసన్న, అటెండర్ కల్యాణిలు, గతంలో చేవెళ్లలో పనిచేసి రిటైర్ అయిన రాజేంద్రకుమార్‌లకు వీడ్కోలు, కొత్తగా చేవెళ్లకు వచ్చిన సీనియర్ అసిస్టెంట్, ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ శ్రీనివాసులు, జూనియర్ అసిస్టెంట్ నయిమొద్దీన్‌లకు స్వాగత కార్యక్రమం నిర్వహించారు. చేవెళ్లలోని డాక్యుమెంట్ రైటర్ల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారికి ఘనంగా సన్మానాలు చేశారు. చేవెళ్లలో తాను ఎక్కువ కాలం పనిచేసే అవకాశం లభించిందన్నారు. తనకు సహకరించిన తోటి ఉద్యోగులకు, సిబ్బంది, డాక్యుమెంట్ రైటర్లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కొత్తగా వచ్చిన అధికారికి కూడా అదేవిధంగా పూర్తి సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో డ్యాకుమెంట్ రైటర్ల సంఘం నాయకులు నర్సింహారెడ్డి, రాంచంద్రయ్య, బుచ్చిలింగం, విఠల్‌దాస్, దయాకర్‌రెడ్డి, మల్లేశ్, ప్రభు, రాములు, శివ, జగదీశ్వర్‌రెడ్డి, శ్రీరాములు, గోపి, మోబిన్, మహేందర్, యాదగిరి ఉన్నారు.


సన్మాన కార్యక్రమంలో డాక్యుమెంట్ రైటర్లు, అధికారులు

ఆ కళాశాలలపై చర్యలు తీసుకోవాలి

మొయినాబాద్: విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతూ.. వారిని మోసం చేసిన భాస్కర మెడికల్ కళాశాల, నైటింగేల్ నర్సింగ్ కళాశాలలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్, అరుణ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం మొయినాబాద్‌లో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. నైటింగేల్ నర్సింగ్ కళాశాలలో మూడేళ్ల క్రితం సుమారు 50 మంది విద్యార్థులు జీఎన్ఎం కోర్సులో చేరారన్నారు. వారిని భాస్కర మెడికల్ కళాశాల ఆస్పత్రికి పంపి మూడేళ్లుగా వారితో వెట్టిచాకిరి చేయించారన్నారు. మూడేళ్లుగా వారికి ఎలాంటి క్లాసులు చెప్పకుండా, పరీక్షలు నిర్వహించలేదని.. జీతభత్యాలు, స్కాలర్‌షిప్‌లు ఇవ్వకుండా ఆస్పత్రిలో పని చేయించారన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవడం కోసం విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు ఇవ్వాలని కళాశాల ప్రిన్సిపాల్‌ను అడిగితే రూ.3లక్షల ఫీజు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారని ఆరోపించారు. క్లాసులు నిర్వహించకుండా వెట్టిచాకిరి చేయించుకొని విద్యార్థులను మోసం చేసిన నైటింగేల్ నర్సింగ్ కళాశాల, భాస్కర మెడికల్ కళాశాలలపై ప్రభుత్వం క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కళాశాలల ముందు ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

ఎస్సీ వర్గీకరణపై సంబరాలు


ప్రధాని, మంద కృష్ణ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

షాబాద్: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును ఆహ్వానిస్తున్నామని స్థానిక అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు సతీశ్, ఎమ్మార్పీఎస్ నాయకుడు విశ్వంమాదిగ, బీసీ సేన జాతీయ అధ్యక్షుడు కృష్ణయాదవ్ పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలో అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేశారు. అనంతరం ప్రధాని మోదీ, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ చిత్రపటాలకు మాజీ జెడ్పీటీసీ లక్ష్మీరాజేందర్‌గౌడ్, బీజేపీ మండల అధ్యక్షుడు కిరణ్‌లతో కలిసి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో కృష్ణ, రాములు, బాల్‌రాజ్, రమేశ్ యాదవ్, అంతయ్య, రాజేందర్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


షాద్‌నగర్‌రూరల్: సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు


షాబాద్: ఆత్మీయ సమ్మేళనంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

షాద్‌నగర్‌రూరల్: మండల పరిధిలోని మొగిలిగిద్ద ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1987–88 సంవత్సరం పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 80 మంది పూర్వ విద్యార్థులు 36 ఏళ్ల తర్వాత ఒక్కచోట కలుకొని ఆత్మీయంగా పలకరించుకొని యోగక్షేమాలు తెలుసుకోవడంతో పాటుగా, చిన్ననాటి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన గురువులను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మదన్‌మోహన్‌రెడ్డి, జగపతిరావు, పుల్లయ్య, లక్ష్మారెడ్డి, శివనాగయ్య, వీరభద్రప్ప, రాములు, విద్యార్థులు మల్లేశ్, బాల్‌రాజ్, నర్సింలు, జమీల్, రవీందర్‌రెడ్డి, రెహమూద్, రామస్వామి, వెంకటయ్య, బాబయ్య, శ్రీను, ఫనికుమార్, శ్రీలత, శోభ, లక్ష్మి, అలివేలు, అరుణ్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపల్లి ఉన్నత పాఠశాలలో..

షాబాద్: మండల పరిధిలోని తాళ్లపల్లి ఉన్నత పాఠశాలలో 1996–97 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం చేవెళ్ల మండలం అల్లావాడ రాజ్యలక్ష్మి గార్డెన్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరినొకరూ ఆత్మీయంగా పలకరించుకున్నారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన పూర్వ ఉపాధ్యాయులు రాంరెడ్డి, నర్సింలు, యాదయ్య, బాల్‌రాజ్‌లను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు వెంకట్‌స్వామి, రాజశేఖర్(లింగం), జంగారెడ్డి, యాదయ్య, భీష్మారెడ్డి, మహేందర్, ఆంజనేయులు, మీనాక్షి, ఇందిర, మంజులు, శివలీల తదితరులు ఉన్నారు.

దేవునిఎర్రవల్లి ఉన్నత పాఠశాలలో..


చేవెళ్ల: సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

చేవెళ్ల: మండలంలోని దేవునిఎర్రవల్లి ఉన్నత పాఠశాలలో 1997–98 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులందరూ కలిసి పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఆదివారం స్నేహితుల దినోత్సవం సందర్భంగా పాత స్నేహితులందరూ ఒకచోట కలవడంతో వారి సంతోషాలకు అవధులు లేకుండాపోయాయి. ఈ సందర్భంగా వారు ముందుగా వారికి చదువు చెప్పిన పూర్వ ఉపాధ్యాయులను పిలిచి ఘనంగా సన్మానించారు. అనంతరం వారందరూ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ సంతోషంగా గడిపారు. కార్యక్రమంలో పాఠశాల పూర్వ విద్యార్థులు ఉపాధ్యాయులు ఉన్నారు.

నాటారు.. వదిలేశారు..!

ఎండిపోతున్న మొక్కలు
- పూడ్చని గుంతలు
- పట్టించుకోని అధికారులు

యాచారం: అధికారుల నిర్లక్ష్యంతో నాటిన మొక్కలు ఎండిపోతున్నాయి. రూ. లక్షలు ఖర్చు చేసి నర్సరీల్లో మొక్కలు పెంచి నాటాలనే లక్ష్యానికి అధికారులు గండికొడుతున్నారు. గుంతలు తీయించేవరకే పర్యవేక్షణ. తదనంతరం మొక్కలు నాటారా? లేదా? అనే విషయాలను పట్టించుకోవడం లేదు. పక్షం రోజుల కింద ఎడతెరిపి లేకుండా వర్షాలు కురియడంతో యాచారం మండల పరిధిలోని తమ్మలోనిగూడ గ్రామ పరిధి సాగర్‌రోడ్డుకు ఇరువైపులా ఈజీఎస్ సిబ్బంది 500 గుంతలు తీశారు. వాటిలో మొక్కలు నాటారు. కానీ మొక్కలు నాటిన గుంతల్లో మట్టి పూడ్చకుండా వదిలేశారు. దీంతో ఆ మొక్కలు కొన్ని ఎండిపోయాయి. వీటి కోసం ఉపాధి కూలీలు మొక్కలు నాటినట్లు వారికి డబ్బులు చెల్లించేటట్లు రికార్డుల్లో నమోదు చేశారు. కాని 500కు పైగా గుంతల్లో నాటిన మొక్కలు అలానే ఉన్నాయి. అవి ఎండిపోతున్నాయి. ఈ విషయమై గ్రామస్తులు అధికారులను పలుమార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకునే వారే కరువైయ్యారు. కనీసం పర్యవేక్షణ చేయడానికి అధికారులు కృషి చేయకపోవడం బాధాకరం అని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


తమ్మలోనిగూడ గేట్ వద్ద మొక్కలు నాటి మట్టి నింపని గుంత